నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 19 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

# వృద్ధురాలి హత్య

- రెండ్రోజుల కిందట అదృశ్యం
- మహిళనుచ ంపిఆ భరణాలు చోరీ
- నిందితుడిగు ర్తింపు

కల్వకుర్తి రూరల్, జనవరి 18 : రెండ్రోజుల కిందట అదృశ్యమైన వృద్ధురాలు హత్యకు గురైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు కథనం మేరకు.. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన గాదమోని శంకరయ్య గౌడ్ భార్య నాగమ్మ (60) రెండ్రోజుల కిందట వంగూరు మండలం ఉల్పర గ్రామంలో ఉన్న కోడలు ఇంటికి వెళ్లేందుకు కల్వకుర్తి బస్టాండ్‌కు చేరుకున్నది. బస్ లేకపోవడంతో అక్కడే కూర్చున్నది. ఆమెను గమనించిన ఒక వ్యక్తి, మరో మహిళ మాటామాటా కలిపి ఉల్పరకు వెళ్తున్నామని నమ్మబలికి ఆటోలో తీసుకెళ్లారు. అచ్చంపేట నియోజకవర్గం మన్ననూర్ అటవీ ప్రాంతం వైపునకు తీసుకెళ్లి సీసాతో గొంతుకోసి వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకువెళ్లారు. నాగమ్మ ఉల్పరకు వెళ్లకపోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్‌లో రికార్డు అయిన సీసీ కెమెరా ఆధారంగా నిందితుడిని గుర్తించారు. నాగమ్మను హత్య చేసిన ప్రదేశం వద్ద మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలికి భర్త, ఐదుగురు సంతానం ఉన్నారు.


రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

# నారసింహుడికి బ్రహ్మరథం

- సింగోటంలో వైభవంగా ఉత్సవాలు • తేరుపై ఊరేగిన స్వామి
- లక్షలాదిగా తరలివచ్చిన జనం • వేడుక చూసి భక్తుల తన్మయత్వం
- మార్మోగిన గోవింద నామస్మరణ • పులకించిన సింగవట్నం

కొల్లాపూర్ రూరల్, జనవరి 18 : మండలంలోని సింగవట్నంలో ఈనెల 15 నుంచి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి ప్రధాన ఘట్టమైన రథోత్సవం కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. అశేషంగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో గోవింద నామస్మరణతో రథం కదిలిన ప్రతి క్షణం ఆధ్యాత్మిక భావోద్వేగాలు భక్తుల మనుసుల్లో పులకించాయి. రథోత్సవం కంటే ముందు గర్భగుడిలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తులు గోవింద నామస్మరణలు, గుడి గంటల మోతలతో ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభ నెలకొన్నది. ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ ఎస్వీకేకేబీ ఆదిత్య లక్ష్మారావు పాల్గొని సంప్రదాయ పూజలు చేశారు. అనంతరం ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ నరసింహస్వామి దయతో కొల్లాపూర్ ప్రాంతం పచ్చగా ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్ కుమార్ శర్మ రథోత్స గంట మోగించడంతో రథోత్సవం ముందుకు కదిలింది. వేలాది మంది భక్తులు ప్రత్యేక్షంగా పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ప్రధాన ఆలయం నుంచి లక్ష్మీదేవమ్మ గుట్ట వరకు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

***రాయలసీమ భక్తుల ఇబ్బందులు..***

ఎన్నో ఏండ్లుగా లక్ష్మీ నర్సింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే రాయలసీమ భక్తులు ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా అవస్థలను ఎదుర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కృష్ణానదిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బోట్ల రాకపోకలను నిలిపివేయడంతో 200 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేసి స్వామిని దర్శించుకుంటున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆరు నెలల్లో తిరుగుబాటు తప్పదు
- 'పాలమూరు' ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా సాధించలేని ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- గులాబీ కేడర్ బలీయమైంది
- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కష్టమేమీ కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పాలమూరు పార్లమెంట్ స్థాయి సమావేశం

మహబూబ్‌నగర్, జనవరి 18 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని.. ఈ పరిస్థితి రాష్ట్రంలో కొనసాగితే కేవలం ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ హస్తం పార్టీ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే.. సమాజంలోని అనేక వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు ప్రజలకు.. కాంగ్రెస్ పార్టీకి గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. రైతు రుణమాఫీ గురించి రేవంత్‌రెడ్డి పదే పదే చెప్పాడు.. ఒకటేసారి రుణమాఫీ చేస్తా అని చెప్పిన ఆయన మాటలకు భిన్నంగా ఈరోజు వ్యవసాయ శాఖ మంత్రి దశల వారీగా రుణమాఫీ చేస్తామని చెబుతున్నారని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రైతు బంధు రూ.10,000 కాదు, రూ.15000 ఇస్తామన్నా.. నేటికీ రైతుల ఖాతాల్లో పడలేదన్నారు. రూ.2వేల పింఛన్‌ను రూ.4 వేలు చేస్తా అన్నా నేటికీ అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. గతంలో రోజుకు పది లక్షల మంది చొప్పున వారం రోజుల్లో 70 లక్షల మందికి పంట పెట్టుబడి సాయం అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా రైతుబంధు ఖాతాల్లోకి ఇంకా వస్తలేదన్నారు. ఎరువుల కోసం లైన్‌లో నిలబడే పరిస్థితులు మళ్లీ వచ్చినయ్.. ఎరువులను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి పంచే పరిస్థితి మళ్లా వచ్చిందన్నారు. ఇలాంటి విషయాలను రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందని దిశానిర్దేశం చేశారు.


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు

***'పాలమూరు'కు జాతీయ హోదా ఏదీ ?***

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధిస్తామని చెప్పారు.. మొన్న రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇద్దరూ కేంద్ర జలవనరుల మంత్రిని కలిసిన తర్వాత జాతీయ హోదా ఇవ్వడానికి వీలులేదని చెప్పారని అన్నారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా మా వల్ల కాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ఎత్తేసింది.. ఈ విషయాన్ని మహబూబ్‌నగర్ ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. పాలమూరుకు పక్కనే ఉన్న కర్ణాటకలో ఉన్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకి జాతీయ హోదా ఇచ్చిన బీజేపీ సర్కారును నిలదీసే ప్రయత్నం ఉత్తమ్, రేవంత్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

***బీఆర్ఎస్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..***

బీఆర్ఎస్‌కు గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి దాకా పెద్ద ఎత్తున అన్ని స్థాయిలలో ప్రాతినిధ్యం ఉన్నదని కేటీఆర్ గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా ప్రతి చోట పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నదని, ఇంతటి బలీయమైన పార్టీ తిరిగి గెలుపు బాట పట్టడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. పార్టీపైన గతంలో జరిగిన దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మన పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రజలకు అందించినా మనపై అసత్య ప్రచారం జరిగిందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పార్టీ అనే తేడాను ప్రజలు తెలుసుకోలేకపోయారు.. ప్రజల కోసం చేసిన కార్యక్రమాలు బీఆర్ఎస్ పార్టీ ద్వారా జరిగాయన్న విషయాన్ని వివరంగా చెప్పలేకపోయామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ల కోసం ఏటా రూ.800 కోట్లు ఖర్చుపెడితే.. మన ప్రభుత్వం రూ.11,700 కోట్లను ఏటా ఖర్చు పెట్టిందన్నారు. ఇంత భారీగా పింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు అందించినా చెప్పుకోవడంలో కొంత విఫలమయ్యామన్నారు. అన్ని స్థాయిల్లో నూతన కమిటీలను ఎన్నుకొని నిరంతరం అన్ని అంశాలపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాల మేరకు కార్యక్రమాల రూపకల్పన జరుగుతుందన్నారు. గెలిచినప్పుడు పొంగిపోలేదు.. ఓటమికి కుంగిపోము.. ఎప్పుడైనా మా పార్టీ ప్రజల కోసం.. ప్రజాప్రయోజనాల కోసమే.. పని చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ శ్వేత పత్రాలతో నాటకాలు మొదలుపెట్టిందని ధ్వజమెత్తారు. పదేండ్లు ప్రజలందరితో కలిసి కష్టపడి, చెమటోడ్చి తెలంగాణ కోసం చేసిన అభివృద్ధిని, ఆస్తుల రూపకల్పనను స్వేదపత్రం పేరుతో మనం ప్రకటించామని చెప్పారు. అప్పులు కాదు.. ఆస్తుల సృష్టించాం.. బంగారు పల్లెంలో పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పజెప్పామని గుర్తు చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా.. గ్రామం నుంచి హైదరాబాద్ దాకా ప్రతి చోటా అనేక వేల కోట్ల ఆస్తులను సృష్టించామన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


దర్గా వద్ద భక్తుల సందడి

# భక్తి సు'గంధం'

- ఘనంగా రంగాపూర్ ఉర్సు గంధోత్సవం • ఫాతేహా సమర్పించి మొక్కులు
- భక్తులతో కిటకిటలాడిన దర్గా పరిసరాలు
- ఉమామహేశ్వర క్షేత్రంలో కొనసాగుతున్న ఉత్సవాలు

అచ్చంపేటరూరల్, జనవరి 18 : మతసామరస్యానికి ప్రతీక అయిన రంగాపూర్‌లోని హజ్రత్ నిరంజన్ షా వలి ఉర్సు ఘనంగా జరుగుతున్నది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్గాను దర్శించుకుంటున్నారు. ఫాతేహా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విందు చేసుకొని ఆరగించారు. కుటుంబాలతో కలిసి సరదాగా గడిపారు. ముస్లింలతోపాటు హిందువులు ఉర్సుకు హాజరయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో సీఐలు అనుదీప్, ఆది రెడ్డి, ఎస్సైలు గోవర్ధన్, గురుస్వామి, శేఖర్‌గౌడ్, రవి బందోబస్తు నిర్వహించారు.

***ఉమామహేశ్వర క్షేత్రంలో..***

శ్రీశైల ఉత్తర ముఖద్వారంగా బాసిల్లుతున్న ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవ సందడి నెలకొన్నది. గురువారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ, తెలంగాణతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుండడంతో నల్లమల పులకించిపోయింది. 16వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 20 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. హైదరాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కొల్లాపూర్, షాద్‌నగర్, కల్వకుర్తి డిపోల నుంచి మినీ బస్సులను తెప్పించి బస్సులను తిప్పుతున్నారు.


నీళ్లు లేక సింధనూరు వద్ద వట్టిపోయిన ఆర్డీఎస్ ప్రధాన కాల్వ

# ఆశలన్నీ అడియాశలే..!

- ప్రాజెక్టుల్లో అడుగంటుతున్న నిల్వలు • క్రాప్ హాలిడే ప్రకటించిన అధికారులు
- ఇక జూరాల కింద యాసంగి సాగు లేనట్టే..! • ఆర్డీఎస్ ఆయకట్టు కింద అంతే..
- నెట్టెంపాడు కింద 5వేల ఎకరాలకు మాత్రమే..
- ధాన్యానికి మంచి ధర వస్తున్నా.. నీళ్లు లేక రైతులకు తప్పని నిరాశ..
- రాబోయే రోజుల్లో తాగునీటికీ కష్టాలే..

గద్వాల, జనవరి 18 : యాసంగి సీజన్‌లో ప్రాజెక్టులను నమ్ముకొని పంటలు సాగు చేయాలనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ఈసారి వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వానలు కురవకపోవడం.. ఎగువనున్న కర్ణాటక, మహారాష్ట్రలోని ప్రాజెక్టుల నుంచి సమృద్ధిగా వరద జలాలు రాకపోవడంతో మన ప్రాజెక్టుల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. రోజురోజుకూ ప్రభావం పెరుగుతుండడంతో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు అడుగంటి పోతుండడంతో సాగునీటితోపాటు తాగునీటికిఇ బ్బందులుపడే అవకాశం కనిపిస్తున్నది.

***క్రాప్ హాలిడేలు..***

కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు కింద ఇప్పటికే అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఆ ప్రభావం మన జూరాల డ్యాంపై పడింది. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటిమట్టం లేక జలకళ తప్పింది. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు బీడుగా మారింది. కేవలం బోరుబావుల కింద మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. మరెక్కడా పంటలను రైతులు సాగు చేయడం లేదు. ఈ ఏడాది ధాన్యానికి ధర భారీగా పెరగడంతో యాసంగిలో వరి పంట వేయాలని రైతులు బోర్ల కింద నారుమడులు పోసుకున్నారు. ఈ ఏడాది కాలం కలిసొచ్చి.. పంటలు బాగా పండితే అప్పులు తీరుతాయన్న రైతుల ఆశలకు ప్రభుత్వం క్రాప్ హాలీడే ప్రకటించడంతో అడియాశలుగా మారాయి. జూరాల పరిధిలో ఎక్కడ చూసినా ప్రస్తుతం బీడు భూములు దర్శన మిస్తున్నాయి. గత యాసంగిలో జూరాల కుడి కాల్వ ద్వారా 14,534 ఎకరాలకు సాగునీరు అందింది. ఈ ఏడాది అందులో 10 శాతం భూములు కూడా సాగులోకి రాలేదు. రాజోళిబండ మళ్లింపు పథకం కింద 33,683 ఎకరాలకు సాగు నీరు అందించగా.. ఈ ఏడాది నీరు రాకపోవడంతో క్రాప్ హాలిడే ప్రకటించారు. అలాగే జవహర్ నెట్టెంపాడ్ ఎత్తిపోతల పథకం ద్వారా 40,044 ఎకరాలకు నీరు అందించగా.. ఈ ఏడాది కేవలం అక్కడి రిజర్వాయర్‌లో నీటి లభ్యత మేరకు మాత్రమే 5 వేల ఎకరాలకు మాత్రమే అధికారులు ప్రతిపాదించారు. అయితే 2023-24 యాసంగిలో అన్ని ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే ప్రకటించడంతో రైతులు అయోమయంలో పడ్డారు. పంటలు వేయకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధర బాగుంది. యాసంగి పంటలు సాగు చేస్తే మంచి మద్దతు ధర లభిస్తుందని భావించిన కర్షకులకు నిరాశే మిగిలింది. గత వర్షాకాలంలో ప్రాజెక్టుకు వరద వచ్చినా నీటిని నిల్వ చేసుకోకపోవడం.. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేయడం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా చెప్పొచ్చు.


జూరాల కింద క్రాప్ హాలిడే ప్రకటించడంతో కొత్తపల్లి శివారులో బీడుగా ఉన్న భూములు

***అడుగంటుతున్న జూరాల..***

జూరాలలో రోజురోజుకూ నీరు అడుగంటి పోతుంది. ఈ ప్రభావం తాగునీటిపై పడే అవకాశం లేకపోలేదు. రైతులు ఇటు సాగునీటికి నోచుకోక.. అటు ప్రజలు తాగునీటికి నోచుకోక ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించింది. ఈ ఏడాదిలో ఇక్కడి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేదు. ప్రజల తాగునీటి అవసరాల కోసం జూరాలలో కనీసం 3 టీఎంసీలు ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం రెండున్నర టీఎంసీలకు మించి నిల్వలు లేవు. ఈ ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథకు తాగునీటి సరఫరాతో పాటు కుడి, ఎడమ కాల్వలకు, భీమా ఎత్తిపోతలకు, నెట్టెంపాడ్, కోయిల్‌సాగర్‌కు నీటిని వినియోగిస్తారు. జూరాల అడుగండడంతో ఈ ప్రభావం అన్ని ప్రాజెక్టులపై పడింది. దీంతో బీడు భూములే దర్శనమిస్తున్నాయి.

### గత యాసంగిలో మూడెకరాలు.. ప్రస్తుతం ఎకరాలో సాగు



గత యాసంగిలో నాకున్న మూడెకరాల్లో వరి సాగు చేశాను.. దిగుబడి బాగానే రావడంతో రూ.లక్ష వరకు మిగిలింది. ఈ సారి జూరాల కింద క్రాప్ హాలిడే ప్రకటించడంతో బోరు బావుల కింద కేవలం ఎకరాలో వరి వేశాను. ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. ఈ తరుణంలో జూరాల నుంచి యాసంగికి సాగునీరు అందించి ఉంటే మళ్లా మూడెకరాలు వేసోటోన్ని. ధర బాగొస్తుండడంతో అప్పుల ఊబి నుంచి గట్టెక్కేవాడిని. మంచి తరుణంలో సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి.

– శ్రీనివాసులు, రైతు, గద్వాల

### బీళ్లను చూస్తే బాధగా ఉంది..



ఈ ఏడాది ధాన్యానికి మంచి ధర వస్తున్నది. యాసంగిలో వరి సాగు చేద్దామంటే నీరు లేదు. రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గతంలో జూరాల కింద నేను 8 ఎకరాల్లో వరి పండించేటోడిని. ప్రస్తుతం జూరాల నుంచి యాసంగికి నీటి విడుదల లేకపోవడంతో బోరు బావి కింద కేవలం మూడెకరాలు మాత్రమే వేశాను. యాసంగి సీజన్ వస్తే పచ్చని పొలాలతో పచ్చగా కనిపించే మా ఊరు.. ప్రస్తుతం బీడు భూములతో కనిపిస్తుండడం బాధగా ఉన్నది.

– వెంకట్రాములు, రైతు, కొత్తపల్లి

# నిలువ నీడ లేదు..

- కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో వసతులు కరువు
- సేద తీరాలంటే చెట్లు, ట్రాక్టర్ ట్రాలీలే గతి
- తాగునీటిని ఇంటినుంచే తెచ్చుకోవాల్సిన దుస్థితి
- ధాన్యం ధరల విషయంలోనూ దగా
- అధికారులపై రైతన్నల మండిపాటు

***ధరల్లోనూ మోసం..!***

గురువారం కల్వకుర్తి మార్కెట్ యార్డుకు 119 మంది రైతులు 4,771 బస్తాల వేరుశనగను తీసుకొచ్చారు. క్వింటాకు గరిష్ఠంగా రూ.8,052, కనిష్ఠంగా రూ.6,261, సరాసరిగా రూ.7,516 పలికింది. ఇక్కడ కూడా మోసం జరుగుతున్నది. వ్యాపారులు పేరుకు మాత్రం 5 నుంచి 10 బస్తాలు మాత్రం గరిష్ఠ ధరకు కొనుగోలు చేసి మిగతా వాటిని సరాసరి ధర లేదా అంతకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు ముందుగానే సిండికేట్‌గా మారి ధరల విషయంలో రైతులను ముంచుతున్నారని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులపై మార్కెట్ అధికారుల అజమాయిషీ లేనందునే ధర విషయంలో దగా పడుతున్నామని రైతులు మండిపడుతున్నారు.


ఇంటి నుంచి తెచ్చుకున్న తాగునీటితో చెట్ల కింద భోజనాలు చేస్తున్న రైతులు


కల్వకుర్తి మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చినవేరు శనగ

కల్వకుర్తి, జనవరి 18 : కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో కనీస వసతులు కరువయ్యాయి. తాగునీటిని కూడా డబ్బులిచ్చి కొనుగోలు చేయాలి.. లేదా ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. విశ్రాంతి తీసుకునేందుకు చెట్లు లేదా ట్రాక్టర్ ట్రాలీలే గతి. మార్కెట్‌కు ఆదాయం వస్తున్నా.. రైతులకు వసతులు కల్పించడంలో విఫలమైనట్లు రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కల్వకుర్తి మార్కెట్‌లో రెండు రోజులు (గురు, ఆదివారం) ధాన్య క్రయవిక్రయాలు చేపడుతారు. రైతులు వేరుశనగను గురువారం ఉదయం 10 గంటల వరకే మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి ప్లాట్‌ఫాంపై కుప్పలుగా పోశారు. మధ్యాహ్నం 12 తరువాత వ్యాపారులు వేరుశనగకు రహస్య టెండర్లు వేశారు. ఆ తరువాత ధాన్యం తూకాలు వేసే వరకు సాయంత్రం 6 గంటలు దాటుతుంది. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు మార్కెట్ యార్డులోనే ఉండాల్సి వస్తుంది. అయితే, రైతులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ అధికారులపైనే ఉంటుంది. తాగునీరు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. రాయితీపై భోజన వసతి కూడా కల్పించే వీలుంటుంది. కానీ, కల్వకుర్తి మార్కెట్‌లో ఇవేవీ కనిపించడం లేదు. రైతులు తాగునీటిని తమ ఊర్ల నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. మరికొందరు ఖాళీ డబ్బాలలో వాటర్ ప్లాంట్‌ల వద్ద నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ విషయంపై మార్కెట్ కార్యదర్శి వివరణకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.